

వి.కోట గ్రామసభలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్, ఒకే వేదికపై ఉన్న టీడీపీ, వైసీపీ నేతలు



విజయపురం మండలం ఆలపాకలో జరిగిన ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో గ్లోరియా



వి.కోట మండలం బోడిగుట్టపల్లె గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పల్లెల్లో జనసభలు

- గ్రామ సభలకు అనూహ్య స్పందన
- రూ.91.30 కోట్లతో 1407 పనులకు ఆమోదం
- ఆయా నియోజకవర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

గ్రామాల సమగ్రాభివృద్ధి, స్వయం సమృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గ్రామ సభలకు శ్రీకారం చుట్టింది. రైతులకు మేలు కలిగేలా, వ్యవసాయ అనుబంధ పనుల్ని కూడా ఉపాధి నిధులతో అనుసంధానం చేసింది. వైసీపీ ప్రభుత్వం ఈ గ్రామసభల నిర్వహణను పూర్తిగా విస్మరించగా.. కూటమి ప్రభుత్వం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నిర్వహించింది. జిల్లాలోని 700 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సభలు నిర్వహించగా.. గ్రామస్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అన్ని పంచాయతీల్లో కలిపి రూ.91.30 కోట్లతో 1407 పనులకు ఆమోదం లభించింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పాల్గొన్న ప్రజాప్రతినిధులు

గుడుపల్లె మండలం పీబీవాడ, కుప్పం రూరల్‌లోని పైపాళ్యం, వెండుగంపల్లె గ్రామసభల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. వి.కోట మండలం బోడిగుట్లపల్లె పంచాయతీలో జరిగిన గ్రామసభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి.. చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాలెం, గుడిపాల మండలంలోని ఏఎల్‌పురం, బసవపల్లె గ్రామ సభల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఎస్ఆర్‌పురం మండలం ముద్దికుప్పం, కార్వేటినగరం గ్రామ సభలకు ఎమ్మెల్యే థామస్.. తవణంపల్లె మండలం కాణిపాకపట్నం, బంగారుపాళ్యం మండలంలోని నలగాంపల్లె గ్రామ సభలకు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. కాణిపాకపట్నంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ కూడా పాల్గొన్నారు. నగరి నియోజకవర్గంలోని వడమాలపేట పంచాయతీ, పుత్తూరు రూరల్‌లోని గోపాలకృష్ణాపురంలో జరిగిన గ్రామసభల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. పులిచెర్ల మండలంలోని 102రామిరెడ్డిగారిపల్లె గ్రామ సభకు పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యేలంతా హామీ ఇచ్చారు. వి.కోట సచివాలయంలో జరిగిన సభకు జడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు హాజరయ్యారు.

గుర్తించిన పనులు..

ఈ గ్రామ సభల్లో ఉపాధిహామీ కూలీల హక్కులు, రాజీలేని అంశాలు, ఉపాధి హామీ తరపున చేపట్టే పనులు, సామాజిక తనిఖీల ప్రాముఖ్యత తదితర విషయాల గురించి అధికారులు గ్రామీణులకు అవగాహన కల్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల్ని గుర్తించి, ప్రణాళికల్ని రూపొందించారు. ఈ సభల్లో భాగంగా మరుగుదొడ్లు, విద్యుత్తు, కొళాయి, వంట గ్యాస్ కనెక్షన్లు, మురుగునీరు- ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంటు రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రాలకు లింకు రోడ్లు, ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివృద్ధికి సదుపాయాలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి సహకారం అందించేలా పనుల్ని గుర్తించి అధికారులు ప్రణాళికల్ని సిద్ధం చేశారు. ఇలా జిల్లాలో శుక్రవారం జరిగిన 700 గ్రామ సభల్లో రూ.1407 పనుల్ని గుర్తించారు. ఈ పనుల పూర్తిగా రూ.91.30 కోట్లు అవసరమున్నట్లు అంచనా వేయగా, ఈ నిధుల్ని ఉపాధిహామీ పథకం ద్వారా ఖర్చు చేయనున్నారు.

గ్రామ సభలు జరిగిన తీరు..

గ్రామ సభల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు, ఉపాధిహామీ ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉపాధి కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఐదేళ్ల తర్వాత సభల్ని నిర్వహిస్తుండడంతో ప్రజలంతా ఉత్సాహంతో పాల్గొన్నారు. ప్రజలు గ్రామాల్లో అవసరమైన పనుల్ని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్జీలు అందించారు. చాలా చోట్ల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరవ్వలేదు. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలో జరిగిన గ్రామ సభలో.. 'మాకు గత ప్రభుత్వంలో పనులు కల్పించలేదని, వైసీపీ నాయకులే పనులు చేసుకున్నారు' అని పలువురు మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతులకు ఉపయోగపడే పనుల్ని కల్పించాలని కోరారు. రామకుప్పం గ్రామసభలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఆగ్రహించారు.

పాల్గొన్న అధికారులు

జీడీనెల్లూరు మండలంలోని పెద్దకాల్వ, చిత్తూరు మండలంలోని ముత్తుకూరు, పూతలపట్టులోని బండపల్లె గ్రామ సభల్లో డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొని, ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనుల్ని వివరించారు. విజయపురం మండలం ఆలపాకంలో, నగరి మండలం తణుకుపేటలో జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

మరింత ప్రోత్సాహం

వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు రెండు నెలలకోసారి ఉపాధి హామీ బిల్లులు వచ్చేవి. ఈ రెండు నెలలుగా పనిచేసిన వారంలోనే బిల్లులు పడుతున్నాయి. ఇప్పుడు గ్రామ సభల నిర్వహణతో మరింతగా ప్రోత్సహిస్తున్నారు.

- కస్తూరమ్మ, వెంకటాద్రికాలనీ, పుంగనూరు మండలం

గ్రామాల్లో పండుగ సంరంభం!

సీఎం నియోజకవర్గంలో గ్రామ సభలకు పోటెత్తిన జనం



కుప్పం మండలం వసనాడులో కళకళలాడుతున్న గ్రామ సభ

కుప్పం: పనులు మానుకున్నారు. రచ్చబండ కాడికో, దేవాలయం వద్దకో చేరుకున్నారు. అమ్మ అక్క, అన్న చెల్లి, అవ్వ తాత.. వయసు తేడా లేదు. కులం, మతంతో పని అసలే లేదు. అక్కడ జరుగుతున్నది తమ భవిష్యత్తును బాగు చేసుకునే కార్యక్రమం. వెళ్లాలి, రేపటి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఇదే ఆలోచన. ఫలితం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలు జనంతో పోటెత్తాయి.

సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో శుక్రవారం గ్రామ సభలు పండుగ వాతావరణంలో జరిగాయి. క్షేత్రస్థాయి.. ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ఈ మూడు వర్గాల భాగస్వామ్యంతో సభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యంగా మహిళలు పెద్దయెత్తున హాజరయ్యారు. కుప్పం మండలం వసనాడు, వెండుగంపల్లె, గుడుపల్లె మండలంలోని పీబీవాడ గ్రామసభల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం పాల్గొన్నారు. గ్రామాలను స్థానిక ప్రజలే పాలించుకోవాలన్న సూత్రంతో సభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏ సభలో చూసినా, ప్రజలతోపాటు అధికార పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పాల్గొన్నారు. సర్పంచులకు ఏమాత్రం ప్రాధాన్యం తగ్గలేదు. నియోజకవర్గంలో అత్యధిక శాతం సర్పంచులు వైసీపీ వారైనా.. వారిని అధికారులు ఆహ్వానించి సముచిత రీతిన సభావేదికపై కూర్చోబెట్టారు. వారి ఆధ్వర్యంలోనే సభలు జరిగేలా జాగ్రత్త వహించారు. ఇన్నాళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో దక్కని భాగ్యం ఇప్పుడు దక్కేసరికి ఆ సర్పంచుల్లో సంభ్రమం కనిపించింది. గ్రామస్థాయికి పాలన రావడమంటే ఇది కదా అని ఒకరిద్దరు వైసీపీ సర్పంచులు వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక, వచ్చిన జనం తమ సమస్యలు చెప్పారు. గ్రామానికి ఏం కావాలో అడిగారు. వీటన్నింటిపై గ్రామ సభల్లో చర్చించి, పనుల జాబితాను తయారు చేసిన అధికారులు, సభల ఆమోదం పొందారు. ఆయా పనులను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి, త్వరలోనే ప్రారంభించనున్నట్లు అధికారులు, నాయకులు హామీ ఇచ్చారు.

ఇది కదా గౌరవమంటే..!

ఇన్నాళ్లు ఒక్కటంటే ఒక్క గ్రామ సభ జరగకపోవడం, తమను అధికారులు పట్టించుకోకపోవడం, పనులకోసం కార్యాలయాలకు వస్తే చీదరించుకోవడం వంటి అనుభవాలు వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణులకు చాలా ఎదురయ్యాయి. అటువంటి చోట,టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా పూర్తికాకుండానే గ్రామ సభల ద్వారా తమ మాటకు విలువనివ్వడం.. సభలు పెట్టి మరీ అవసరాలను అడిగి, జాబితా తయారు చేసి, ఆమోదం పొందడం.. ప్రజలకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.అందుకనే పిలిచినా, పిలవకున్నా గ్రామ సభలకు భారీగా హాజరయ్యారు. మొత్తమ్మీద అయిదేళ్లుగా కనిపించని ప్రజాస్వామ్య పండుగ వాతావరణం గ్రామసభల మూలంగా శుక్రవారం సాక్షాత్కరించింది.

ఇంట్లో టపాకాయల పేలుడు

- తీవ్రతకు కుప్పకూలిన భవనం
- భార్య, భర్త, కుమారుడికి తీవ్రగాయాలు
- భారీగా నిల్వ ఉంచడమే కారణం







పేలుళ్ల ధాటికి కుప్పకూలిన భవనం - గాయపడి చికిత్సపొందుతున్న ఖాదర్ బాషా - తీవ్రంగా గాయపడ్డ బాలుడు హమీద్ బాషా

గంగవరం, ఆగస్టు 23: భారీగా టపాకాయలను నిల్వ ఉంచిన ఇంట్లో పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న భార్య, భర్త, మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గంగవరం మండలం మారేడుపల్లెలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మారేడుపల్లెకు చెందిన ఖాదర్ బాషా(39) ఏటా టపాకాయల లైసెన్సు పొంది విక్రయిస్తుంటారు. దీంతోపాటు ఇంట్లో నిల్వ ఉంచుకొని ఏదైనా ఊరేగింపులకు, కార్యాలకు అమ్మేవారు. శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో పలమనేరు నుంచి ఖాదర్ బాషా ఇంటికి వచ్చారు. ఆ కొద్దిసేపటికే ఏం జరిగిందో కానీ.. భారీ పేలుడు శబ్దం వినిపించింది. పేలుడు తీవ్రతకు ఇల్లు కుప్పకూలి నేలమట్టమైపోయింది. ఇంట్లోని బీరువాలు, కిటికీలు, పలు వస్తువులు సుమారు 100 మీటర్ల దూరంలో ఎగిరి పడ్డాయి. ఇంటి సమీపంలోని రెండు ఆవులు మృతిచెందాయి. ఇంట్లోనే ఉన్న ఖాదర్ బాషా, అతడి మూడేళ్ల కుమారుడు హమీద్ బాషా రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్నారు. స్థానికులు వెంటనే పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాదర్‌బాషా భార్య జరీనా (35) ఆచూకీ కనబడకపోవడంతో చుట్టుప్రక్కల ప్రాంతాల్లో వెదికారు. చివరకు కూలిన గోడల కింద ఉన్న ఆమెను గుర్తించారు. గంగవరం సీఐ ప్రసాద్, పోలీసులు సమీపంలోని ఎక్స్‌కవేటర్‌ను రప్పించి కూలిన గోడలను పక్కకు తీయించి అతికష్టంపై జరీనాను బయటకు తీయగలిగారు. వీరి ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇళ్లు భూకంపం వచ్చినట్లు అవడంతో.. ప్రజలు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు.

తప్పిన పెను ప్రమాదం

పేలుడు సంభవించిన భవనం సమీపంలోనే ఓ చిల్లర దుకాణం ఉంది. ఇక్కడ రాత్రి 9.30 గంటల వరకు సుమారు 20 మంది వరకు కూర్చొని ఉంటారు. పేలుడు సమయంలో ఆలయం వద్ద పూజ ఉండటంతో ఇక్కడ గుమికూడే వాళ్లంతా అక్కడికి వెళ్లారు. దీంతో పెను ప్రమాదమే తప్పింది. ఒకవేళ పేలుడు సమయంలో వీరంతా ఉన్నట్లయితే.. వీరూ తీవ్రంగా గాయపడి ఉండేవారు.

పేలింది నల్లమందా.. టపాకాయలా?

ఇంత భారీ పేలుడు సంభవించిందంటే ఇంట్లో భారీగా ఉన్న నల్లమందా లేదా టపాకాయల నిల్వలా.. ఏది కారణమనే అనుమానాలు కలుగుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇలా ఇళ్లల్లో అక్రమంగా టపాకాయలు నిల్వ ఉంచుతున్నారన్న ఆరోపణలున్నాయి. గంగవరంలో ఇంకా పలుచోట్ల టపాకాయలు అక్రమంగా నిల్వ ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి ప్రమాదం మరొకటి జరగకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద..

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్-3 నమూనాలు తయారు చేశారు. అంతరిక్షానికి సంబంధించి పలు ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చంద్రయాన్ విజయవంతంపై తయారు చేసిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అంతకుముందు ప్రార్థన సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

- చిత్తూరు (సెంట్రల్)

ఇసుకపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబరు

చిత్తూరు కలెక్టరేట్,ఆగస్టు23: ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలు, ఇబ్బందులు ఏర్పడితే టోల్‌ఫ్రీ నెంబరు 08572-299509 లేదా chittoorsand75@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, టిప్పర్ యజమానులు, వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

కుప్పంలో ఎస్పీ తనిఖీలు



కుప్పం, ఆగస్టు 23: కుప్పం డీఎస్పీ కార్యాలయం, రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఎస్పీ మణికంఠ తనిఖీ చేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సైని ఆదేశించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. కుప్పంలో బ్లాక్ స్పాట్‌లను పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్, రూరల్ సీఐలు జీటీ నాయుడు, మల్లేశ్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థులు

● ఆరుగురికి వార్డులో, ముగ్గురికి ఐసీయూలో చికిత్స



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 23: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలో బాధిత విద్యార్థులు కోలుకున్నారు. గురువారం కూడా 200 మందికి పైగా వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారానికి 9 మంది మినహా మిగిలిన వారందరు డిశ్చార్జ్ అయ్యారని అపోలో యూనిట్ హెడ్ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఆరుగురు వార్డులో, ముగ్గురు ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని శనివారం డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. ఫుడ్ పాయిజన్ ఘటనతో భయందోళనకు గురైన విద్యార్థులకు అందులో నుంచి బయట పడడానికి నాలుగు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. దీంతో అనేక మందికి విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. కిచెన్, మెస్‌ను ప్రక్షాళన చేస్తున్నట్లు నరేశ్‌రెడ్డి తెలిపారు. కాగా, గురువారం తిరుపతి స్విమ్స్ నుంచి వచ్చిన రాపిడ్ రెస్పాన్స్ టీం సేకరించిన నమూనాలకు సంబంధించి రిపోర్టు 48 గంటలు తర్వాత వస్తుందని డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి తెలిపారు. శుక్రవారం కూడా మరికొందరి విద్యార్థుల మోషన్ సేకరించినట్లు ఆమె చెప్పారు.

మేటిమందలో పిచ్చికుక్క వీరంగం

పలువురికి గాయాలు



సోమల, ఆగస్టు 23: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటిమందలో పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. శుక్రవారం దారి పోతున్న పలువురిని కాటు వేసింది. మేటి మందకు చెందిన వెంకట్రమణ, గంగిరెడ్డిపల్లె శంకర్, మంజుల, ద్యాంపద్ద బాబు, బంగ్లా పెద్దోడు తదితరులను గాయపరిచింది. బాధితులను సదుం ప్రభుత్వ వైద్యశాలకు, మరి కొందరిని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు మాజీ సర్పంచు శ్రీనివాసులునాయుడు, వై.మోహన్ నాయుడు తరలించారు.

నక్షత్ర తాబేలు, నాటు తుపాకీ స్వాధీనం

● ఒకరి అరెస్ట్



అటవీ అధికారుల అదుపులో నిందితుడు అంకయ్య

పుంగనూరు, ఆగస్టు 23: నక్షత్ర తాబేలు, నాటు తుపాకీ కలిగి ఉండడంతో మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ శికారీపాళ్యానికి చెందిన అంకయ్యను అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ అధికారి శ్రీరాములు కథనం మేరకు.. అంకయ్య(65) ఇంట్లో నక్షత్ర తాబేళ్లు ఉన్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో వెళ్లి తనిఖీ చేపట్టారు. అట్టపెట్టెలో ఒక నక్షత్ర తాబేలు, నాటు తుపాకీని గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి చిత్తూరులో జడ్జి ఎదుట హాజరుపరిచారు. ఈ దాడుల్లో పుంగనూరు అటవీశాఖ ఆధికారులు రాకేశ్‌కుమార్, కిరణ్‌కిషోర్, రాజశేఖర్, శోభనాద్రి, యువరాజ్, శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

నేడు డివిజన్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్‌మెంట్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 23: మండల స్థాయిలోని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీఎస్ పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పూర్తయిన నేపథ్యంలో శనివారం డివిజన్ స్థాయి ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. డివిజన్ స్థాయి సర్‌ప్లస్ టీచర్లు కొద్ది మంది మాత్రమే ఉన్న క్రమంలో జాబితా ఆన్‌లైన్‌లో రాగానే గంటల వ్యవధిలో పూర్తి చేసేందుకు డివిజన్ ఇన్‌చార్జులు సిద్ధమయ్యారు.

విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



వాసు (ఫైల్ ఫొటో)

విజయపురం, ఆగస్టు 23: విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో కాంట్రాక్టు ఫీల్డు అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మండలంలోని పన్నూరులో శుక్రవారం చోటుచేసుకుంది. నగరి రూరల్ మిట్టపాళెంకు చెందిన వాసు(30) ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు పద్ధతిన ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. పన్నూరులోని ఓ రైతు పొలంలో విద్యుత్ తీగలను మరమ్మతు చేస్తుండగా షాక్ కొట్టడంతో స్తంభం నుంచి కింద పడ్డాడు. గ్రామస్థులు వెంటనే నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గొల్లకండ్రిగ వద్ద లైన్ క్రాసింగ్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

బైక్‌తో గోతిలో పడి వ్యక్తి మృతి



గోతిలో పడి మృతిచెందిన తమిళనాడువాసి

గుడిపాల, ఆగస్టు 23: బైక్‌తో సహా గోతిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా అరక్కోణంకు చెందిన వేలాయుధం ఈనెల 21వ తేదీన కుమార్తెను చిత్తూరు అపోలో కళాశాలలో చేర్పించాడు. తిరిగి వస్తుండగా చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని చిత్తూరు రూరల్ మండలం గోపాలపురం సమీపంలో నేషనల్ హైవే అధికారులు రోడ్డు పనుల నిమిత్తం తీసిన గోతిలో బైక్‌తో సహా పడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు చిత్తూరు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి, పరిశీలించి తమిళనాడు వాసిగా గుర్తించారు. చిత్తూరు తాలుకా ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యాక్సిల్ విరిగింది..టైరు పంక్చరైంది

కారు అదుపు తప్పి ఇద్దరికి స్వల్ప గాయాలు



వెదురుకుప్పం, ఆగస్టు 23: కార్వేటినగరం బంగారమ్మ ఆలయ సమీపంలో వెనుక యాక్సిల్ విరిగి, టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి కారులో ఆరుగురు కార్వేటినగరం మీదుగా ఊతుకోటకు వెళ్తుండగా బంగారమ్మ ఆలయ సమీపంలో గోడను ఢీకొంది. ఇందులో నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బాలికకు లైంగిక వేధింపులు

చిత్తూరు, ఆగస్టు 23: చిత్తూరు నగరం వెంగళరావు కాలనీకి చెందిన ఓ వ్యక్తి బాలికను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇతడు నగరంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తరచూ ఆమె ఇంటికెళుతూ 14 ఏళ్ల కుమార్తెను లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం.

రోడ్డు కుంగి.. డ్రైనేజీలో పడి..!

● కౌలాలంపూర్ ప్రమాదంలో గల్లంతైన కుప్పం మహిళ



కుప్పంలోని ఆమె కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం



23కేపీయం 45- విజయలక్ష్మి (ఫైల్ ఫొటో)



కౌలాలంపూర్‌లోని ప్రమాద స్థలం

కుప్పం, ఆగస్టు 23: కుప్పం పట్టణం అనిమిగానిపల్లెకు చెందిన జి.పళని కుమార్తె విజయలక్ష్మి, మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ప్రమాదానికి గురయ్యారు. ఆమె రోడ్డుమీద నడుస్తుండగా హఠాత్తుగా రోడ్డు కుంగింది. రోడ్డు కిందనున్న మురుగునీటి కాలువలో ఆమె పడిపోయినట్లు కుప్పంలోని కుటుంబ సభ్యులకు సమాచారమందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నంలు శుక్రవారం విజయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గురైన విజయలక్ష్మిని రక్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు ఆర్ముగం, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ తదితరులు

కుప్పం, ఆగస్టు 23: శాంతిపురం మండలంలో జూన్ 6వ తేదీన ఒక ఇంట్లో జరిగిన దోపిడీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. కుప్పంలోని తన కార్యాలయంలో శుక్రవారం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన ప్రకారం.. శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ తోపుచేను గ్రామానికి చెందిన హెచ్.షర్మిళ ఇంట్లో జూన్ నెల 6వ తేది రాత్రి 11.50 గంటల సమయంలో ఐదుగురు దుండగులు చొరబడ్డారు. ముఖాలకు ముసుగులు, చేతులకు గ్లవ్స్ వేసుకుని ఉన్నారు. షర్మిళను కాళ్లు చేతులు కట్టేసి, అరవకుండా నోటిని చున్నీతో మూసేశారు. ఆమె మెడలోని బంగారు చైను, వరండాల్లో ఉంచిన ద్విచక్ర వాహనం దొంగతనం చేసుకుని పారిపోయారు. ఈ దోపిడీపై ఆమె రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సాంకేతిక ఆధారాలతో పరిశోధన సాగింది. శుక్రవారం ఉదయం శాంతిపురం మండలం దండికుప్పం వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న కొందరిని ఆపి ప్రశ్నించారు. ఈ విచారణలో షర్మిళ ఇంట్లో దోపిడీ చేసినవారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన శాంతిపురం మండలం దండికుప్పం పంచాయతీ సిద్దారెడ్లపల్లె గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశ్, కొలమడుగు పంచాయతీ వేటగిరికొత్తూరు గ్రామానికి చెందిన ఎ.కుమార్, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా అనికెట్టు తాలూకా పోయిగై గ్రామానికి చెందిన ఎం.కార్తీక్, పిల్లియర్ గ్రామానికి చెందిన ఎం.మోహన్‌రాజ్, మార్చంబట్టు గ్రామానికి చెందిన ఎస్.శాంతకుమార్‌ను అరెస్టు చేశారు. నిందితులను కోర్టు ముందు హాజరు పరిచి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

వి.కోట బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు

క్షేత్ర పరిశీలనలో కలెక్టర్‌కు జేఏసీ నేతల ఫిర్యాదు



వి.కోట బైపాస్‌లో జరిగిన అవకతవకలను కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరిస్తున్న జేఏసీ నేతలు

వి.కోట, ఆగస్టు 23: వి.కోటకు మంజూరైన బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు జేఏసీ నేతలు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు బైపాస్ రోడ్డు తూర్పున కాకుండా, కర్ణాటక మీదుగా వేయడం వల్ల ప్రయోజనం లేదని స్థానికులు వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది రియల్టర్ల స్వప్రయోజనాల కోసం హైవే అధికారులు లేని దూరాన్ని డీపీఆర్‌లో చూపి నిర్మాణ వ్యయం ఎక్కువ చేసి తూర్పు బైపాస్ అలైన్‌మెంట్ కాకుండా కర్ణాటక మీదుగా బైపాస్ రోడ్డు వేసేలా అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. దీనిపై గతంలో 45 రోజుల పాటు మండల ప్రజలు ఉద్యమించి 7 వేల సంతకాలు సేకరించి పంపితే పట్టించుకోలేదని వివరించారు. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు సైతం రెండు హైవేలు కలిసేలా బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్రమంత్రికి రాసిన లేఖను ఆయనకు అందజేశారు. తూర్పు వైపున బైపాస్ అందుబాటులోకి వస్తే 9 పంచాయతీల మీదుగా వెళ్తుతుందని, ఏడు గ్రామీణ రహదారులు, రెండు హైవేలు కలసి ట్రాఫిక్ పట్టణంలోకి రాకుండా అటునుంచే వెళ్లే అవకాశం ఉంటుందని టీడీపీ నేతలు కలెక్టర్‌కు వివరించారు. కర్ణాటక మీదుగా రోడ్డు వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే కోలారుకు వెళ్ళాల్సి వస్తుందని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అభ్యంతరం తెలిపారు. నెర్నపల్లె వద్ద రియల్టర్ల భూమిని కాపాడేందుకు రోడ్డు గ్రామం మధ్యలో వెళ్లేలా మార్పులు చేయడంతో ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చామన్నారు. ఇక, రామకుప్పంలో కార్గో ఎగుమతుల నిమిత్తం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే తూర్పు బైపాస్ అనువుగా ఉంటుందని ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు ఆయనకు వివరించారు. తూర్పు బైపాస్ కావాలని 18 పంచాయతీలు, మండల పరిషత్ ఏకగ్రీ రాత్మానాలు చేసినా పట్టించుకోకుండా, భూసేకరణ పూర్తి కాకుండా టెండరు ప్రక్రియ పూర్తి చేయడంలో ఆంతర్యమేమిటని హైవే అధికారులను స్థానికులు ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్‌కు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వివరించారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుని తూర్పు వైపే బైపాస్ నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై జాతీయ రహదారుల శాఖ ఈఈని వివరణ కోరగా అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు మార్పులు జరిగినట్లు చెప్పే ప్రయత్నం చేశారు. అధికారుల సమాధానంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఖచ్చితంగా తూర్పు వైపే బైపాస్ వచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

● వివాహేతర సంబంధమే కారణం



చికిత్స పొందుతున్న రాధిక, సతీష్

చంద్రగిరి, ఆగస్టు 23: చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు మార్గంలో ఇద్దరు పురుగుల మందు ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన విజయ్, రాధిక(25)కు ఆరేళ్ల కిందట క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అయితే రాధిక అదే గ్రామానికి చెందిన సతీష్(19)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. మూడ్రోజుల కిందట రాధిక, సతీష్‌లు ఇళ్ల నుంచి పరారయ్యారు. అప్పటినుంచి కుటుంబీకులు గాలిస్తున్నారు. శుక్రవారం ఉదయం వీరిద్దరూ తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని శ్రీవారి మెట్టు మార్గం ద్వారా శ్రీనివాసమంగాపురానికి బయల్దేరారు. ఈ సమయంలో రాధిక తన పిల్లలతో మాట్లాడాలని భర్తకు ఫోన్ చేసింది. అతడికి అనుమానం వచ్చి తన బంధువులతో కలిసి శ్రీవారిమెట్టు మార్గానికి చేరుకున్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో 800 మెట్టు సమీపంలో రాధిక, సతీష్‌లు కిందకు దిగుతూ నీరసంగా కనిపించారు. విజయ్ తన భార్య వద్దకొచ్చి పురుగుల మందు తాగి ఉందన్న విషయాన్ని తెలుసుకుని.. అక్కడే వాంతులు చేయడానికి ప్రయత్నించాడు. అనంతరం ఆమెను తన భుజాన వేసుకుని, సతీష్‌ను మరో వ్యక్తి భుజాన వేసుకుని శ్రీవారిమెట్టు వద్దకు చేరుకున్నారు. తర్వాత 108 వాహనంలో వీరిద్దరినీ చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించాక వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ



ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా నిలబడిన విద్యార్థులు

కుప్పం, ఆగస్టు 23: కోల్‌కత్తాలోని ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శుక్రవారం కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు. మళ్లీమళ్లీ ఇటువంటి హత్యాచార ఘటనలు జరుగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, మహిళా సాధికారత సెల్ కో ఆర్డినేటర్ ఆశ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మికుంట చెరువు దురాక్రమణపై సీసీఎల్ఏ విచారణకు ఆదేశం

చౌడేపల్లె, ఆగస్టు23: జమ్మికుంట చెరువు ఆక్రమణపై సీసీఎల్ఏ విచారణకు ఆదేశించినట్లు సెంటర్ ఫర్ ఆక్స్ అండ్ రైట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు ఉత్తరాది హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, చౌడేపల్లె సర్పంచ్ వరుణ్ కుటుంబసభ్యులు జమ్మికుంటను చెరువును ఆక్రమించారన్నారు. దీనిపై ఆగస్టు 8న మంగళగిరిలోని చీఫ్ కమిషన్ ఆఫ్ ల్యాండ్ అడ్మిస్ట్రేషన్ క మిషనర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. స్పందించిన కమిషనర్ చెరువు దురాక్రమణపై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని వివరించారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

గంగవరం, ఆగస్టు 23: టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్ర గుప్తాపై జరిగిన హత్యాయత్నం ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. నిందితుల్లో బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, కోలార్‌కు చెందిన కానిస్టేబుల్ వినాయకం కూడా ఉన్నారు. సీఐ తెలిపిన ప్రకారం.. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన రఘుచంద్రగుప్తా కారును ఈనెల 19వ తేది రాత్రి గంగవరం మండల పరిధిలోని మినీ లారీతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. హత్యాయత్నంకు పాల్పడిన బైరెడ్డిపల్లె మండలం వైసీపీకి చెందిన మాజీ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి, కోలారులో ఐడిపార్టీ కానిస్టేబులు వినాయకం, ముళబాగిల్‌కు చెందిన మినీ లారీ డ్రైవర్ అస్లాం, ముళబాగిల్ తాలూకా కన్నసంద్రం గ్రామానికి చెందిన శీనప్ప, మునెప్పను గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరు ఉపయోగించిన మినీ లారీ, కారును సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. కాగా, రాజకీయంగా రఘుచంద్రగుప్తా తనకంటే పైకి ఎదుగుతుండటంతో శ్రీనివాసులురెడ్డి ఓర్వలేక కోలారుకు చెందిన కానిస్టేబుల్‌కు సుపారీ ఇచ్చి హతమార్చాలని ప్రయత్నించినట్లు నిందితులు విచారణలో అంగీకరించారని తెలిసింది.

పైన గాజులు.. లోపల మద్యం



గాజులపెట్టెలో మద్యం అమ్ముతూ పట్టుబడ్డ సుబ్రమణ్యం

గంగవరం, ఆగస్టు 23: గాజులమ్మ గాజులో.. అంటూ గ్రామాల్లో అరుస్తూ బైకుపై వస్తాడాయన. ఆడవాళ్లంటే గాజులు చూపించేవాడు. అదే మగాళ్లకు బాక్సులో గాజుల కింద ఉంచిన కర్ణాటక మద్యం అమ్మేవాడు. ఇలా గాజులు అమ్ముతున్నట్లు నటిస్తూ కర్ణాటక మద్యం విక్రయిస్తున్న సుబ్రమణ్యంను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇతడిది గంగవరం మండలం నల్లసానిపల్లె గ్రామం. కొన్నిరోజులుగా గాజులు వ్యాపారం చేస్తున్నట్లు నటిస్తూ కర్ణాటక సరిహద్దు నుంచి గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతుండేవాడు. ఇదే రూట్‌లో తిరుగుతూ ఆడవాళ్లకు గాజులు అమ్ముతూ, మగవాళ్లకు కర్ణాటక మద్యం విక్రయిస్తూ సులభంగా సొమ్ము చేసుకొనేవాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఉయ్యాలమిట్ట గ్రామం నుంచి గడ్డిండ్ల రోడ్డులో తనిఖీలు నిర్వహించగా గాజులమ్ముతున్నానని పోలీసులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నించాడు. పోలీసులకు అనుమానం వచ్చి తనిఖీలు చేయగా గాజుల బాక్సుల కింద టెట్రా మద్యం ప్యాకెట్లు బయటపడ్డాయి. సుబ్రమణ్యంను అరెస్టు చేసి.. 432 టెట్రాప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ఇంట్లో చోరీ

144 గ్రాముల బంగారం, రూ.1.75 లక్షల నగదు అపహరణ



ఇంటి తాళాన్ని పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

యాదమరి, ఆగస్టు 23: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి బంగారం, నగదును చోరీ చేసిన ఘటన మండలంలోని ఎర్రచేను గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సురేంద్ర, సుధారాణి దంపతులు ఊరికి దూరంగా ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. గురువారం బంగారుపాళ్యం మండలం మొగిలీశ్వర స్వామి ఆలయంలో బంధువుల పెళ్లి ఉండటంతో వెళ్లి ఆ రోజు రాత్రి అక్కడే ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.10 లక్షల విలువ చేసే 144 గ్రాముల బంగారం, రూ.1.75 లక్షల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు వెస్ట్ సీఐ శ్రీనాథ్ నాయుడు ఆధ్వర్యంలో క్లూస్ టీము అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మున్సిపల్ కార్మికులకు సీఎంసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం



పలమనేరు/ పుంగనూరు, ఆగస్టు23 : మున్సిపల్ కార్మికులకు, వారి కుటుంబ సభ్యుల కోసం పలమనేరులోని కాకాతోపు పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి చెందిన 25 మంది వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. కంటి పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన సమస్యలు, జనరల్ ఓపీడీ, సాధారణ జబ్బులకు స్క్రీనింగ్ చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 35 మందిని చీలాపల్లి సీఎంసీకి రెఫర్ చేశారు. పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీలోని కార్మికుల కోసం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. సీఎంసీ డైరెక్టర్ డాక్టర్ అశ్విన్, వారి సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, అర్బన్ యూపీఎస్సీ డాక్టర్లు నిరంజన్, డాక్టర్ ఆశ, సబ్‌యూనిట్ అధికారి జయ శంకర్, హరి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



విద్యార్థులు ఇటుకలతో ఏర్పాటు చేసిన స్పేస్ డే ఐకాన్

పలమనేరు, ఆగస్టు 23: కొలమాస నపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఇటుకలతో నేషనల్ స్పేస్‌డే ఐకాన్‌ను రూపొందించారు. హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైన్సు టీచర్లు నాజర్ అలీ ఖాన్, శ్రీనివాసులు, స్వరూప తదితరులు విద్యార్థులకు అంతరిక్షంపై అవగాహన కల్పించారు.

ఆలయ షెడ్‌ను తొలగించిన అటవీ సిబ్బంది

పలమనేరు, ఆగస్టు 23 : క్రిష్టాపురం గ్రామ సమీపంలో గ్రామస్తులు గ్రామ దేవత పూజల కోసం ఏర్పాటు చేసుకొన్న రేకుల షెడ్‌ను అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది జేసీబీతో కూల్చివేశారు. దీనిపై గ్రామస్తులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి, అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ సరిహద్దులో ఉన్న ఈ షెడ్డును అటవీశాఖ సిబ్బంది అనవసరంగా కూల్చివేసి తమ మనోభా వాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఎమ్మెల్సీకి ఆహ్వానం

కుప్పం, ఆగస్టు 23: కుప్పంలో ఈనెల 26వ తేదీన ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనా ల్సిందిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సమితి ప్రతినిధులు శుక్రవారం ఆహ్వా నించారు. ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. త్రైత సిద్ధాంత భగవ ద్గీతను అందజేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ జమీం దారు బంగళా సమీపంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహి స్తామని చెప్పారు. ఈ నెల 31న ఊరేగింపు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు నాగరాజు, ప్రకాశ్, కృష్ణారెడ్డి, వెంకటేశ్, శివకృష్ణ, కుమార్, కృష్ణన్న, ఇందిర, వెంకటలక్ష్మి, రాధా, పూజ, యశ్విని పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో ఉన్నత ఫలితాలు

వి.కోట, ఆగస్టు 23: ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధనా పద్ధతుల వల్ల ఉన్నత ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గోవిందాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులపై సమీక్ష చేపట్టారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు మరింతగా కష్టపడాలని సూచించారు. హెచ్‌ఎం ప్రమీల, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకుందాం

వి.కోట, ఆగస్టు 23: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యానికేతన్ కళాశాల కరస్పాండెంట్ దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మునిరత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనులకు తీర్మానం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 23 : మండలంలోని 21 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో చేపట్టనున్న ఉపాధి పనులను గుర్తించి తీర్మానం చేశారు. గ్రామసభలను ఎంపీడీవో రాజేంద్రబాలాజీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వివిధశాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలని కలెక్టర్‌కు వినతి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 23 : బైరెడ్డిపల్లెలో బైపాస్‌రోడ్డు ఏర్పాటుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చాలని పలువురు రైతులు శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విన్నవించారు. శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలిసి బైపాస్ గురించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలైన్‌మెంట్ మార్పుచేయాలని రైతులు కోరడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరాజు పాల్గొన్నారు.

పల్లెసీమల ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం



బందార్లపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 23: రాష్ట్రంలో పల్లెసీమల ప్రగతే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్‌ఎంపీ చిన్నికృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు హరీ‌ష్‌లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో జరిగిన పలు గ్రామసభల్లో వారు మాట్లా డారు. ఆయా గ్రామసభల్లో ఎంపీడీవో ఈశ్వరన్న, డీఎల్‌పీఓ రాధాకృష్ణ, ఉపాధి ఏపీఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామసభలు

చౌడేపల్లె, ఆగస్టు23: గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ హనుమంత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉపాధి అనుసంబంధ పనులు, ఉద్యానవన అభివృద్ధి, చెరువులు అభివృద్ధి, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, పొలాల ప్రహరీ, ఇంకుడు గుంతలు, ఫారం పాండ్ తదితర పనులు గుర్తించినట్లు తెలిపారు. కాగతి పంచాయతీలో సర్పంచ్ షంషీర్ గ్రామసభ వేదిక వద్దకు వస్తుండగా గ్రామస్తులు, టీడీపీ కార్యకర్తలు వెళ్లద్దు అని నినాదాలు చేశారు. దీంతో ఆయన ప్రజలతో పాటు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు ఎంఈవో కేశవరెడ్డి, ఏవో జ్యోతి, ఏపీఎం నరోత్తమరెడ్డి, ఏపీవో శ్రీనివాస్‌యాదవ్, ఏఈ మణి, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ రియాజ్‌వల్లి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బస్టాండులో ఆక్రమణల తొలగింపు



చౌడేపల్లె, ఆగస్టు23: చౌడేపల్లె బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు చర్యలు శుక్రవారం రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ చౌడేపల్లెకు చెందిన చెన్నరాజశెట్టి లోకా యుక్తాలో బస్టాండ్ దురాక్రమణలపై కేసు వేయడంతో కోర్టు ఆదేశాలతో సర్వేలు జరిపి ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల పాటు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగనున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, వీఆర్‌వోలు అశోక్‌రెడ్డి, గుర్రప్ప, బాలాజి, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

14న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పుంగనూరు రూరల్, ఆగస్టు23: సెప్టెంబరు 14న పుంగనూరులో జరిగే జాతీయ లోక్‌అదాత్‌ను విజయవంతం చేయాలని పుంగనూరు ఇన్‌చార్జి న్యాయమూర్తి శిరీష్ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు, చౌడేపల్లె సీఐలు శ్రీనివాసులు, రాంభూపాల్, ఎస్‌ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



పుంగనూరు రూరల్, ఆగస్టు 23: మండలంలోని గూడూరుపల్లె జడ్పీ ఉన్నత హైస్కూల్లో స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మహేశ్‌నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, ఆగస్టు23: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శ్రావణమాస శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అధికసంఖ్యలో ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, ఆగస్టు23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రావణ శుక్రవారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వీఆర్‌వోను సస్పెండ్ చేయాలి

పలమనేరు, ఆగస్టు23 : పలమనేరు మండలం పెంగరగుంట వీఆర్‌ఓగా పనిచేస్తున్న గోవిందును సస్పెండ్ చేయాలని శుక్రవారం పలమనేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డీవీమునిరత్నం, పార్థ, మణి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దేవేంద్ర, మురుగయ్యల తండ్రి మరణానంతరం ఆస్తిని పంచుకున్నారని తెలియజేశారు. అయితే వీఆర్‌వో గోవిందు రెవెన్యూ రికార్డుల్లో దేవేంద్ర, మురుగయ్యతో పాటు చక్రపాణి, నీలమ్మ అనే వారిని కూడా చేర్చారని ఆరోపించారు. అధికారులు స్పందించి వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, సాంబశివ, సర్వస్వతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

గ్రామసభలతో అభివృద్ధి ఖాయం

గుడుపల్లె, ఆగస్టు 23: గ్రామ సభలతో గ్రామాల అభివృద్ధి ఖాయమని అందుకే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఉపాధి హామీ గ్రామ సభలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దబదనవాడలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పారు. మండలానికి 500 పశువుల పెంపకం షెడ్లు మంజూరు చేస్తామన్నారు. మండలంలోని పంచాయతీల్లో ఉపాధి గ్రామసభలు జరి గాయి. ప్రజల సమస్యలపై వినతులు అందించారు. తహసీల్దారు సీతారామ్, ఎంఈవో లక్ష్మయ్య, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసురాజు, సీఎం పీఏ మనోహర్, మునిరాజు, శ్రీని వాసులు, వెంకటేష్, నాగరాజు, ఉదయ్‌కుమార్, అమీర్, మునీర్, భాస్కర్ ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అటవీ కార్యక్రమాలన్నీ గజప్రజ యాప్‌లో ఉంచాలి



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి

పలమనేరు, ఆగష్టు23 : అటవీశాఖలో జరిగే కార్యక్రమాలు అన్నీ ఇకపై ఎప్పటికప్పుడు గజప్రజ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అటవీశాఖ అధికారులను, సిబ్బందిని జిల్లా అటవీ శాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పలమనేరు రేంజి పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గజప్రజ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పలమనేరు రేంజర్ శివన్న తదితరులు పాల్గొన్నారు.

పలమనేరుకు రూ. 1.94 కోట్ల మంజూరు

పలమనేరు, ఆగస్టు23 : పలమనేరు మండలానికి ప్రభుత్వం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 1.34 కోట్లు, తాగునీటి అవసరాల కోసం రూ. 60 లక్షలు మంజూరు చేసిందని ఎంపీడీఓ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 5 గ్రామ పంచాయితీల్లో నిర్వహించిన ఉపాధి హామీపథకం ప్రణాళిక గ్రామసభల్లో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు వేయిస్తామని, ఎక్కడా తాగునీటి సమస్యలేకుండా చూస్తామని వివరించారు. మండల ప్రత్యేక అధికారి కిషోర్‌నాయక్ పాల్గొన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను గ్రామసభల్లో గుర్తించారు.

గ్రామ స్వరాజ్యమే చంద్రబాబు ధ్యేయం


హైస్కూల్ స్థల దాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం

కుప్పం రూరల్, ఆగస్టు 23: గ్రామ స్వరాజ్యం సాకారమై, గ్రామాలు మళ్లీ స్వయం సమృద్ధితో కళకళలాడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. కుప్పం మండలంలోని వసనాడు, వెండుగంపల్లె తదితర గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామ సభల్లో వారు ప్రసంగించారు. అధికారులు, ప్రజలు కలిసి కూర్చుని గ్రామాలకు ఏయే సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు అవసరమో ఒక జాబితా తయారు చేసుకుని, అంచనాలు తయారు చేసుకుని ఆమోదం పొందడమే గ్రామ సభల ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలా రూపొందించుకున్న జాబితాలోని పనులను ఉపాధి పథకం ద్వారా చేసుకోవచ్చని తెలియజేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ప్రాధాన్య మిస్తామని చెప్పారు. రోడ్లు, కాలువలు వంటి సదుపాయాలు జాబితాలో చోటు చేసుకుంటాయన్నారు. అలాగే మల్లానూరు, టి.సదుమూరు, పైపాళ్యం తదితర గ్రామాలన్నింటిలో ఏకకాలంలో సభలు నిర్వహించి అభివృద్ధి పనులను గుర్తిం చారు. వసనాడు ఉన్నత పాఠశాలకు ఉచితంగా స్థలాన్ని వితరణ చేసిన దాత కామాక్షమ్మ, వెంకటేశ్‌లను సన్మానించారు. ఆయా పంచాయతీ సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా దౌర్జన్యాలు, దోపిడీలే : చల్లా బాబు


రామిరెడ్డిపల్లిలో అర్జీలను స్వీకరిస్తున్న చల్లా బాబు

కల్లూరు, ఆగస్టు 23: ఐదేళ్ల వైసీపీ పాలన దౌర్జన్యాలు, దోపీడీలతోనే సాగిందని గ్రామాల అభివృద్ధి శూన్యమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం 102ఈ రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన గ్రామసభలో చల్లా రామ చంద్రారెడ్డి మాట్లాడారు. గతంలో చంద్రబాబు పాలనలో వేసిన ఎల్‌ఈడీ బల్బులే నేటికీ ఉన్నాయని, సీఎం జగన్ పాలనలో కనీసం విద్యుత్ బల్బులు వేసిన దాఖలాలు లేవన్నారు. దీంతో గ్రామాలు అంధ కారంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, తహశీల్దార్ జయసింహ, ఏపీవో షౌకత్‌అలీ, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, ధనంజయనాయుడు, రమేష్, మహేష్, శీను, సుబ్రమణ్యంనాయుడు, నాగరాజ, నవీన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగ్రామాల కోసమే గ్రామసభలు

రొంపిచెర్ల: ఐదు సంవత్సరాల తర్వాత స్వర్ణ గ్రామాల నిర్మాణం కోసమే ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పది పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు జరిగాయి. బోడిపాటివారిపల్లె గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెప్పఅచారి, పీఆర్‌ఏఈ ఉమా మహేశ్వర్, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాలరమణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బాబుతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



కెనమాకులపల్లె గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

శాంతిపురం, ఆగస్టు 23 : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయ కుమార్, టీడీసీ మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని 20 గ్రామ సచివాలయాల్లో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు సహకారంతో పంచాయతీల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ మైథలి సోన్నేగానిపల్లె, కొలమడుగు, ఆవోఆర్డీ రవినాయక్ అబకలదొడ్డి, తుమ్మిశి, దండికుప్పం పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. పలువురు అధికారులు, నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే కర్లగట్ట వద్ద కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. కుప్పం ఎయిర్‌పోర్టుకు త్వరలోనే శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, టీడీపీ నేతలు, అధికారులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి : జెడ్పీ చైర్మన్

వి.కోట, ఆగస్టు 23: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంచాయతీ పరిధిలో అవసరమైన పనుల వివరాలను ప్రజల నుంచి తీసుకున్నారు. మల్బరసాగు, గొర్రెలు, గేదెల షెడ్ల నిర్మాణానికి, మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. వీధి దీపాలు, పారిశుధ్యం సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. భారత్ నగర్ మీదుగా కీలపల్లె కట్ట కాలువపై పత్రపల్లె వరకు సీసీ రోడ్డు నిర్మించా లన్నారు. భారత్‌నగర్‌లో మురుగుకాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఒకే వేదిక పై వైసీపీకి చెందిన జడ్పీ చైర్మన్, సర్పంచ్, వైస్ సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మరోవైపు టీడీపీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ సభకు పెద్ద ఎత్తున హాజరుకావడం గమనార్హం. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ, వైస్ సర్పంచ్ అక్మల్, ఎంఈవో మురుగేష్, మాజీ సర్పంచ్ సుబ్బన్న, మాజీ జడ్పీటీసీ చౌడప్ప, భాగా ప్రజలు హాజరయ్యారు.

ప్రజాపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యం



గ్రామసభలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు, ఆగస్టు23: ప్రజా పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమవుతుందని టీడీపీ పుంగనూరు మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 23 పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పనులు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లు, విద్యుత్, సీసీ రోడ్లు, మండల కేంద్రాలకు లింక్ రోడ్లు, తదితర సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని అన్ని పంచా యతీల్లో వైసీపీ సర్పంచ్‌లు పాల్గొనగా బండ్లపల్లె, మాగాండ్లపల్లె, నేతిగుట్లపల్లె పంచాయతీల్లో వైసీపీ సర్పంచులు గ్రామసభలకు హాజరుకాలేదు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. పనుల మంజూరుకు ప్రతి పాదనలు పంపారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ ఏడీ మనోహర్, ఏపీవో శ్రీనివాసులు, పంచాయతీరాజ్ జేఈ సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు గంగాధర్, శమీపతి, రమణ, గంగులప్ప, మంజునాథ్, సుబ్బు, దాము, హరి నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం : అమర్

వి.కోట, ఆగస్టు 23: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం వి.కోట మండలం బోడిగుట్టపల్లెలో జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పంచాయతీలో అనేక సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ పరిధిలోని దొడ్డిపల్లె కాలనీలో నివాస గృహాలపై విద్యుత్ 11 కేవీ లైన్ వెళుతోందని ప్రమాదకరంగా ఉన్నదాన్ని మార్పుచేయాలని, వీధి కొళాయిలు కావాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చల్లపల్లెలో మురుగుకాలువ ఏర్పాటు చేయాలని కోరారు. యర్రంపల్లె రోడ్డు సమస్యను పరిష్కరించి, మంజూరైన బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. బోడిగుట్టపల్లెలో సీసీ రోడ్డు వేయాలని, బోడిగుట్టపల్లె సమీపంలోని నీటికుంటను వైసీపీ నేత ఆక్రమించాడని దాన్ని కాపాడాలని కోరారు. ఇంటి పట్టాలు, పక్కాగృహాలు, పశువులు, గొర్రెలకు షెడ్లుకావాలని పలువురు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, సర్పంచ్ విశ్వనాథ్, తహసిల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, సీఐ సోమశేఖర్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, ఏపీవో ఆశోక్‌రెడ్డి, ఇతర అధికారులు, స్థానిక టీడీపీ నేతలు ఎంసీ కృష్ణప్ప, మురళి, రాజన్న, వినోద్, బీజేపీ, జనసేన నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలి


రాకెట్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కల్లూరు ఆగస్టు 23: ప్రతి విద్యార్థీ ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి ఆకాంక్షించారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన చంద్రయాన్ మిషన్-3, రాకెట్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ భావాలు అలవర్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, రహమత్‌బాషా, రేణుకాదేవి పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడికి విశేష పూజలు

కల్లూరు, ఆగస్టు 23: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు విశేషంగా దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా పాకాల మండలం పదిపుట్లబైలుకు చెందిన శ్రీరాములు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

టీకాల పట్ల అపోహలు వద్దు

సదుం, ఆగస్టు 23: పశువుల్లో కనిపించే గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తే పాల దిగుబడి తగ్గిపోతుందన్నది కేవలం అపోహ మాత్రమేనని చెరుకువారిపల్లె వెటర్నరీ వైద్యుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం చెరుకువారిపల్లె, జోగివారిపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ అవకాశాన్ని పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాభివృద్ధికి గ్రామసభలు కీలకం


గ్రామాభివృద్ధిపై చర్చించుకుంటున్న గ్రామస్తులు

సదుం, ఆగస్టు 23: గ్రామాల అభివృద్ధికి గ్రామసభల నిర్వహణ అత్యంత కీలకం అని సదుం సర్పంచ్ ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సదుం గ్రామ పంచాయతీ గ్రామసభ కార్యదర్శి హసీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యక్తిగత, ప్రభుత్వ లబ్ధి, గ్రామసమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అధికారులతో, నాయకులు ముఖాముఖి చర్చించారు. ఉప సర్పంచ్ బాబురెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, పవన్ కుమార్, కృష్ణయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, వసంత్, రత్న, బాబు, సుమారు 200 మంది రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని 18 పంచాయతీల్లోనూ ఎంపీడీవో రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

సోమల, ఆగస్టు 23: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాభివృద్ధి సాధించవచ్చునని మండల ప్రత్యేక అధికారి (ఏడీఏ) శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని 15 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారులు ఉపాధి పనుల వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామసభల్లో ఎంపీడీవో నారాయణ, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, రమేశ్‌నాయుడు, ఉమాపతి నాయుడు, శివశంకర్, సుబ్బరాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అక్కదేవతలకు పచ్చ పూజలు

చౌడేపల్లె, ఆగస్టు23: చిట్రేడ్డిపల్లె సమీపంలోని అక్కదేవతల ఆలయంలో అక్కదేవతలకు పచ్చ వేసి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా బస్టాండులో వెలసిన కమలాంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామస్తులు 24 కొత్త అక్కదేవతల అశ్వాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా స్థానిక సబ్ స్టేషన్ వద్ద ఉన్న అక్క దేవతల ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కదేవతలకు పచ్చ వేసి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానంచేశారు.

గ్రామసభలో వెల్లువెత్తిన సమస్యలు


సమస్యలపై సమాధానం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి సుధాకర్

గంగవరం, ఆగస్టు23: మండలంలోని గంగవరంలో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు, నాయకులు పలు సమస్యలు లేవనెత్తారు. శుక్రవారం గంగవరం సచివాలయం వద్ద సర్పంచ్ చంద్రమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గంగవరం సాయినగర్, గంగవరం గ్రామం, చిన్నూరు, నడింపల్లె, కూర్నిపల్లె, మారేడుపల్లె, ఉయ్యాల మిట్ట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారు. పంచాయతీ కార్య దర్శి సుధాకర్ మాట్లాడుతూ సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణం, మరమ్మ తులకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామని, మంజూరుకాగానే పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మంజునాధరెడ్డి, ఎంపీటీసీ కేశవులు టీడీపీ నాయకులు మురళి, యుగంధర్‌నాయుడు, ఎస్సీసెల్ రవి, గిరి, ఆనంద్‌నాయుడు, చిట్టిబాబు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి


ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 23: రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు మరువలేనివని డీఆర్వో పుల్లయ్య అన్నారు. శుక్రవారం టంగుటూరి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని పాత స్పందన హాలులో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన నిర్ణాయక పాత్ర పోషించారని పేర్కొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బాని బాషా, కలెక్టరేట్‌లోని అధికారులు పాల్గొన్నారు.

హస్త కళలను ప్రోత్సహించాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 23: హస్త కళలను ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ స్థానికంగా లభ్యమయ్యే వనరులతో వస్తువులు తయారు చేసే నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. టెంకాయ పీచుతో బొమ్మలు, మ్యాట్లు, బుట్టలు, ఫ్లవర్ వాజులు తదితరాలు ఆకర్షణీయంగా చేసుకోవచ్చునన్నారు. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన లక్‌పతిధి పథకాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య, ఏపీఎంలు, జిల్లా పతాధికారులు, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలువ పొరంబోకులో ఆక్రమణల తొలగింపు

నగరి, ఆగస్టు 23 : పట్టణ పరిధిలోని నాగలాపురం రోడ్డులో కాలువ పొరంబోకు స్థలంలో ఆక్రమణలను అధికారులు శుక్రవారం తొలగించారు. నెల రోజుల క్రితం నగరి-నాగలాపురం మార్గంలో ఎస్ఎస్ కల్యాణ మండపం సమీపంలో కొందరు గుడిసెలు ఏర్పాటు చేశారు. తహసీల్దారు రవికుమార్, సీఐ మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తమ సిబ్బందితో కలిసి గుడిసెలను తొలగించారు. ప్రభుత్వ భూములు, కాలువ పొరంబోకుల్లో ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు.

సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలి

నగరి, ఆగస్టు 23: సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం లాంటి అంశాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ మహేశ్వర్ అన్నారు. శుక్రవారం వీసీఎన్ బాలికల కళాశాలలో విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు. సైబర్ మోసాల బారినపడకుండా అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎలా అడ్డుకోవాలో చెప్పారు. మాదకద్రవ్యాల వాడకంతో జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు.

జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి : టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 23: మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించాల్సింది పోయి సీఎం చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచిందని, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేలా జగన్ విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా జగన్‌కు, వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతలు వెంకటేష్ యాదవ్, మధు యాదవ్, ధరణి ప్రకాష్, బాబు నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 23: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శుక్రవారం శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ముందుగా మహాలక్ష్మి మూలవర్లకు అభిషేకం, పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు పరస్పర వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

పాళ్యంకొండ అభివృద్ధికి సహకరించండి



గుడిపాల, ఆగస్టు 23: మండలంలోని ఏఎల్‌పురం సమీపంలో వెలసిన పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, కార్యదర్శి తారకరామ్ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కోరారు. ఆలయానికి సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ట్రెజరర్ రాజు, కమిటీ సభ్యులు రమేష్, భూపాల్ నాయుడు, డిల్లీబాబు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రకాశం పంతులు జయంతి

వెదురుకుప్పం, ఆగస్టు 23: కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం, టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను జరుపుకున్నారు. టంగుటూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టంగుటూరి గొప్పతనాన్ని వివరించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. డైట్ ప్రిన్సిపాల్ శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పరిమితులు లేవు

వెదురుకుప్పం, ఆగస్టు 23: మానవ జ్ఞానం, సృజనాత్మకతకు పరిమితులు లేవని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, ఆగస్టు 23: కార్వేటినగరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం కార్వేటినగరానికి చెందిన కుప్పయ్య అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని కుప్పయ్య తెలిపారు.

వైభవంగా గంగపెట్టె ఊరేగింపు

వెదురుకుప్పం, ఆగస్టు 23: కార్వేటినగరం బోడిబాపనగుంట సమీపంలో వెలసి ఉన్న కానగలమ్మ ఆలయ తిరునాళ్లను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంగపెట్టెను ఊరేగించారు. ఆదివారం వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం

గుడిపాల, ఆగస్టు 23: మండలంలో డ్రైనేజీ కాలువ, సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గురజాల చెన్నకేశవులు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పూర్తిగా పక్కదోవ పట్టిందన్నారు. మాజీ సర్పంచ్ ఉదయ, టీడీపీ నాయకులు కిట్టు, చిన్నబ్బ నాయుడు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల సమాచారమివ్వండి

ఐరాల, ఆగస్టు 23: ఆరోగ్య సమస్యలు నయం చేస్తామని, పూజలు చేస్తామని ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ మణికంఠ కోరారు. ఒంటరిగా ఉన్న మహిళను గుర్తించి, పూజల పేరుతో నగలను ఎత్తుకెళ్లిపోతారని, ఇలాంటి ఘటన ఐరాల మండలంలో జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని లేదా డయల్ 100, 112 లేదా పోలీసు వాట్సప్ నెంబరు 9440900005కు సమాచారం ఇవ్వాలని కోరారు.

25, 26 తేదీల్లో ప్రత్యేక పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 23: కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో కాలభైరవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కాలభైరాష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అగస్థీశ్వరాలయంలో పూజలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ అర్చకులు శివకుమార్ గురుకుల్‌తో కలిసి విడుదల చేశారు.

సత్యశోధనకు నిబద్ధత అవసరం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 23: సత్యశోధనకు నిబద్ధత ఎంతో అవసరమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రేయానంద సరస్వతి చిన్మాయానంద తెలిపారు. సద్గురు ఆశ్రమంలో శుక్రవారం ఆమె భగవద్గీతలోని జ్ఞానయోగం, కేనోపనిషత్తు అధ్యాయాలను ప్రబోధించారు. ఆశ్రమ నిర్వాహకులు పరబ్రహ్మ స్వామి, రఘుపతి, కేశవులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చంద్రబాబు మార్క్ అభివృద్ధి


సభలో మాట్లాడుతున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు రూరల్, ఆగస్టు 23: గ్రామాల్లో ఇకపై చంద్రబాబు తరహా అభివృద్ధి కనిపిస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద పంచాయతీ గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో చిన్న పని కూడా జరగలేదన్నారు. సర్పంచ్‌లు డమ్మీలుగా మారారని తెలిపారు. నిధులను పక్కదారి పట్టించి అభివృద్ధిని గాలికొదిలేశారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే జిల్లాకు రూ.17 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇకపై గ్రామాల్లో ఎవరి పనులు వారు చేసుకోవచ్చన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు పాల్గొన్నారు. కాగా, తుమ్మిందలో టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో పార్టీ బలంగా ఉందని, గత ఎన్నికల్లో 3,750 పైచిలుకు మెజారిటీ వచ్చిందని తెలిపారు.

గుడిపాల : ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆధ్వర్యంలో మండలంలోని ఏఎల్‌పురం, బసవాపల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయాలని తీర్మానించారు. ఏఎల్‌పురంలో బ్లాక్ ప్లాంటేషన్ కింద చెట్లు నాటారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, దశల వారీగా పరిష్కరిస్తామన్నారు.

ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకోండి


ముదికుప్పం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 23: జాతీయ ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ముదికుప్పం గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. మండలంలో అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తన పేరు చెప్పి ఎవరైనా అక్రమాలకు పాల్పడాలని చూస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీవో మురళీమోహన్, ఏపీవో చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, సర్పంచ్ గిరి, రాజశేఖర్ నాయుడు, ఎన్.కుమార్, వెంకటేష్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే థామస్ హాజరయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు తీసుకొచ్చానని, త్వరలో మరో రూ.5కోట్లు వస్తాయని తెలిపారు. 300 ఉద్యోగాలు మంజూరు చేయించానని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కె.పట్నం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళి

తవణంపల్లె, ఆగస్టు 23: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మండలంలోని కె.పట్నం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామ సభకు వీరు హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేశారని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎన్ని రకాల పనులు చేపట్టవచ్చో వివరించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీవో లలిత, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, అమరేంద్రనాయుడు, గోపి యాదవ్, ధనంజయ నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : మండలంలోని 42 పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి, గ్రామాభివృద్ధి పనులపై తీర్మానాలను ఆమోదించారు. నలగాంపల్లె గ్రామంలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. మండలానికి ఎన్ఆర్ఈజీఎస్, గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అనుబంధంతో రూ.2.32 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం


వడమాలపేట గ్రామసభలో మాట్లాడుతున్న భానుప్రకాష్

వడమాలపేట, ఆగస్టు 23: క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శుక్రవారం వడమాలపేట గ్రామసభలో ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు గ్రామసభల ద్వారానే పరిష్కారం చేసేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. గుంట అభివృద్ధి చేయాలని, ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించాలని స్థానికులు కోరారు. గ్రామసభలో ఎంపీపీ విజయలక్ష్మి, తహసీల్దార్ జరీనా, పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ, టీడీపీ నేతలు ధనంజయులు నాయుడు, మురళీధర్‌రెడ్డి, ముని తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: మండల పరిధిలోని గోపాలకృష్ణాపురంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ ఇకపై పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, అధికారులే గ్రామానికి వచ్చారని చెప్పారు. గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ కాలువలు, తాగునీరు, శ్మశాన వాటికలు సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు.

ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణను అడ్డుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అబ్బూ అనిత

గంగాధరనెల్లూరు, ఆగస్టు 23: మండల పరిధిలో ఖాళీ ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని అడ్డుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. మండల సమావేశం శుక్రవారం ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన నిర్వహించారు. గంగాధరనెల్లూరు, పెద్దకాల్వ సర్పంచ్‌లు సుబ్రమణ్యం, ఏకాంబరం మాట్లాడుతూ పురాతన తాగునీటి ట్యాంకుల స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరారు. వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు - వెజ్జుపల్లె ఆర్టీసీ బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పింఛన్ పంపిణీలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వకుండా టీడీపీ నేతల ద్వారా ఇప్పించడంపై వైస్ ఎంపీపీ హరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. కలిజవేడు సర్పంచ్ నీలావతి చెరువుల్లో తుమ్మచెట్లు పూర్తి స్థాయిలో తొలగించి, కట్టలను పటిష్టం చేయాలని కోరారు. వెటర్నరీ, విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడారు. పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జడ్పీటీసీ దుద్దుకూరు లక్ష్మీప్రియ, తహసీల్దార్ చంద్రశేఖర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

25న తెలుగు మహాసభలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 23: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 25న భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎం.వి.కేశవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు 250 మంది రచయితలు పాల్గొననున్నారని వారు పేర్కొన్నారు.

26నుంచి గోకులాష్టమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 23: చర్చివీధి రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి సెప్టెంబరు ఒకటి వరకు గోకులాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ టి.జి.బుల్లెట్ సురేష్ తెలిపారు. 26న గోకులాష్టమి, 27న శ్రీకృష్ణజయంతి, 28న కల్యాణోత్సవం, అన్నదానం, 29న భజన, 30న సహస్రదీపాలంకరణ, అన్నదానం, 31న పుష్పపల్లకి, సెప్టెంబరు 1న ఉట్టి ఉంటాయని వివరించారు.

వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు గుర్తింపు లేదు

గుడిపాల, ఆగస్టు 23: వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు గుర్తింపు లేదని, గ్రామాల అభివృద్ధి కూడా జరగలేదని బసవాపల్లి వైసీపీ సర్పంచ్ వినీల తమ ఆవేదనను వెలిబుచ్చారు. శుక్రవారం బసవాపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సమక్షంలో ఆమె పై విధంగా వ్యాఖ్యానించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్పంచ్‌లకు గుర్తింపు ఇవ్వడంతో పాటు పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం హర్షదాయకమన్నారు.

వానరానికి అంత్యక్రియలు

బంగారుపాళ్యం, ఆగస్టు 23: మండలంలోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో ఓ వానరాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా, మృతిచెందింది. బంగారుపాళ్యం పోలీసులు గ్రామస్తులతో కలసి దానికి పూజలు నిర్వహించి, బలిజపల్లి చెరువులో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ లక్షుమయ్య, హెడ్‌కానిస్టేబుల్ బాబు, సిబ్బంది బెనర్జి రావు పాల్గొన్నారు.

అనుమతుల్లేని క్లినిక్స్‌పై చర్యలు

నగరి, ఆగస్టు23: అనుమతి లేని, రిజిస్టర్ చేసుకోని క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఐవో డాక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని క్లినిక్‌లు, ఆర్ఎంపీ హాస్పిటల్స్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. క్లినిక్, ఆర్ఎంపీ పర్యవేక్షణలోని ఆస్పత్రులకు గుర్తింపు తప్పనిసరిగా ఉండాలన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



శ్రీరంగరాజపురం, ఆగస్టు 23: ఎస్ఆర్‌పురం ఎస్ఐగా సుమన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు నుంచి బదిలీపై వచ్చిన ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను సన్మానించారు.

చంద్రయాన్ ఆకారంలో..



బంగారుపాళ్యం, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం చంద్రయాన్ ఆకారంలో నిలబడ్డారు. హెచ్ఎం అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ చంద్రుడిపై సురక్షితంగా అడుగుపెట్టిన నాల్గవ దేశంగా భారతదేశం నిలవడం గర్వకారణమన్నారు. సైన్స్ క్లబ్ ప్రతిపాదికులు షంషీర్ ఖాన్, విజయకుమారి, వేణు రెడ్డి, దేవకి, వెంకటస్వామి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సభలు



పాలసముద్రం మండలం క్రిష్ణజిమ్మాపురం సభలో జడ్పీసీఈవో గ్లోరియా

పాలసముద్రం, ఆగస్టు 23 : ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలయ్యే నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని జడ్పీ సీఈవో గ్లోరియా కోరారు. మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామ సభలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. చెరువులు, సాగునీటి కాలువలు, మొక్కల పెంపకం, పశువుల షెడ్లు, కోళ్లఫారాల షెడ్లు, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణంపై చర్చించారు.

విజయపురం : ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో గ్లోరియా పేర్కొన్నారు. మండలంలోని ఆలపాకంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకంలో రైతులు పండ్ల మొక్కలు, పూలతోట పెంపకాలు, రోడ్డు అభివృద్ధి, ఫారంపాండ్ వంటి పనులు చేసుకోవాలని కోరారు.

పూతలపట్టు : గ్రామ సభలకు వచ్చిన ప్రతి వినతినీ పరిష్కరిస్తామని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఎం.బండపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరలో జరుగనున్న సభల్లో పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో ధనలక్ష్మి, తహసీల్దార్ గుర్రప్ప పాల్గొన్నారు.

ఐరాల : గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, టీడీపీ అధికారంలోకి రావడంతో వాటికి మళ్లీ మహర్దశ వచ్చిందని టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఐరాల సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు.

నగరి : మండలంలోని 22 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, అటవీ ప్రాంతాలలో కందకాలు తవ్వడం, రైతుల భూములలో పండ్లతోటల పెంపకం, శ్మశానాలకు దారులు, శ్మశానాల వద్ద షెల్టర్ల ఏర్పాటు తదితర పనులకు ఆమోదం తెలిపినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు.

పెనుమూరు : మండలంలోని 25 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, పలు అంశాలపై తీర్మానం చేశారు. డ్రైనేజీలు, తాగునీరు, వీధి లైట్లు, సిమెంటు రోడ్లు కావాలని ప్రజలు కోరారు. పండ్ల తోటలు, ఫారం పాండ్ ఇతర పనులను కొందరు రైతులు కోరారు. మరికొందరు చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఎరువులు తయారు చేయాలని కోరారు.

నింద్ర : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సభలు నిర్వహించారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ, పంట కాలువల అనుసంధానం వంటి పనులను గుర్తించి, తీర్మానించినట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు.

గంగాధరనెల్లూరు : మండలంలోని 32 పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీల్లో ఏయే గ్రామానికి ఏయే పనులు అవసరమో కనుక్కుని తీర్మానాలు రాసి సంతకాలు చేశారు.

వెదురుకుప్పం : మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో పనులను గుర్తించి, తీర్మానాలను అంగీకరించారు. మాంబేడులో ఈవోఆర్డీ పురుషోత్తం హాజరయ్యారు. వివిధ గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.